వినియోగదారుల మెప్పు పొందాలి

● ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ, ఆగస్టు 11: వ్యాపారులు వినియోగదారుల మెప్పు పొందేలా సేవలందించాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ పట్టణంలో శ్రీ రాజ రాజేశ్వర సూపర్ మార్కెట్‌ను ఆయన ప్రారంభించి, మాట్లాడారు. నాణ్యమైన వస్తువులను అందించి వినియోగదారుల మన్ననలు పొందినప్పుడే వ్యాపారం అభివృద్ధి చెందుతుందని చెప్పారు. బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు కూడా ప్రారంభోత్సవానికి హాజరుకాగా సూపర్ మార్కెట్ యజమానులు గణేశ్, రమేశ్ ఘనంగా సన్మానించి సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బింగి మహేశ్, కౌన్సిలర్లు నిమ్మశెట్టి విజయ్, నరాల శేఖర్, పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు రేణుకింది ఆశోక్, నాయకులు పొలాస నరేందర్, గొస్కుల రవి, రంగు వెంకటేశ్, ప్రసాద్ రావు, ఈర్లపల్లి రాజు, కొండ కనుకయ్య, గంగాధర్, రాము తదితరులున్నారు. కాగా, వేములవాడ పట్టణంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను మై విలేజ్ షో సభ్యులు మర్యాద పూర్వకంగా ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా ఆయనను సన్మానించారు. ఇక్కడ మై విలేజ్ షో సభ్యులు గంగమ్మ తదితరులున్నారు.

వేములవాడ: సూపర్ మార్కెట్‌ను ప్రారంభించి బిల్లు ఇస్తున్న ఎమ్మెల్యే

వేములవాడ : వేములవాడ బీఆర్ఎస్ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావును సన్మానిస్తున్న యజమానులు

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

చందుర్తి, ఆగస్టు 11: చందుర్తి మండలం ఎన్గల్‌కు చెందిన మెరుపుల లచ్చయ్యకు సీఎంఆర్ఎఫ్ కింద మంజూరైన రూ.13 వేల చెక్కును ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఆదివారం అందజేశారు. మల్యాల గ్రామానికి చెందిన సర్వాయి లింగవ్వకు రూ.51 వేలు, నేరెళ్ల అక్షయకు రూ.26 వేల చెక్కులను ఇద్దరికి అందజేశారు. ఇక్కడ మండలాధ్యక్షుడు చింతపంటి రామస్వామి, మాజీ జడ్పీటీసీ నాగం కుమార్, నాయకులున్నారు.

రైస్ మిల్ ప్రారంభం

చందుర్తి, ఆగస్టు 11: మండలంలోని ఎన్గల్ గ్రామంలో నూతనంగా నిర్మించిన భ్రమరాంబికా రైస్ మిల్‌ను ఆదివారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ప్రారంభించారు. ఇక్కడ మాజీ జడ్పీటీసీ నాగం కుమార్, నాయకులు, ముస్కు ముకుంద రెడ్డి, బాణాల గంగారెడ్డి, మ్యాకల పరశురాములు, లింగంపల్లి సత్తయ్యలున్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ముస్తాబాద్ ఆగస్టు 11 : మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జిల్లా ఉపాధ్యక్షుడు బుర్ర రాములు గౌడ్ శనివారం మృతి చెందగా ఆయన కుటుంబ సభ్యులను ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, సిరిసిల్ల నియోజకవర్గ కాంగ్రెస్ కన్వీనర్ కేకే మహేందర్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ గుండం నరసయ్య, కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ రాష్ట్ర నాయకుడు కన్నెవేని చక్రధర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఇక్కడ కాంగ్రెస్ నాయకులు కిషన్‌రావు, అంజన్‌రావు, తదితరులున్నారు.

వస్త్ర సంక్షోభంతో ఉపాధి కోల్పోయిన నేతన్నలకు నిత్యావసర వస్తువులు అందజేస్తున్న పోపా ప్రతినిధులు

నేతన్నకు అండ.. యువతకు భరోసా..

వస్త్ర పరిశమపై ఆధారపడ్డ నేతన్నకు అండగా నిలు స్తూ.. ఉన్నత విద్యలో రాణించేలా ఉచిత శిక్షణతో యువతకు భరోసానిస్తూ ముందుకు సాగుతున్నది పద్మశాలీ అఫీషియల్ అండ్ ప్రొఫెషనల్ (పోపా). సర్కారు కొలువులు కొట్టిన పేదింటి బిడ్డలను ప్రో త్సహిస్తూ నైపుణ్యాన్ని చాటిన నేతన్నల బిడ్డలకు ప్రతిభా పురస్కారాలతో సత్కరిస్తున్నది. జిల్లా కీర్తిని నలుదిశలా చాటేలా పద్మశాలీయుల ఆత్మగౌర వం ఇనుముడింపేలా సేవలను విస్తరిస్తున్నది.

● సామాజిక సేవలో 'పోపా'

రాజన్నసిరిసిల్ల, ఆగస్టు11(నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ పాలనలో వస్త్ర పరిశ్రమకు కేంద్రబిందువైన సిరిసిల్ల నేతన్నల నైపుణ్యం బతుకమ్మ చీరెలతో దేశ వ్యాప్తమైంది. ప్రస్తుతం నెలకొన్న సంక్షోభంతో నేతన్నల పరిస్థితి దయనీయంగా మారింది. ఇలాంటి తరుణంలో నేనున్నానంటూ పోపా అండగా నిలిచింది. నాలుగు నెలలుగా నేతన్నల్లో ఆత్మస్థైర్యం నింపే అనేక కార్యక్రమాలను చేపట్టింది. ప్రముఖ సైకాలజిస్టు కనుకుంట్ల పున్నం చందర్ జిల్లా కార్యదర్శి ఆధ్వర్యంలో పోపా వివిధ సామాజిక సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. రిటైర్డ్ టీచర్ గాజుల ప్రతాప్, వెల్ది హరిప్రసాద్, సీనియర్ జర్నలిస్టు మచ్చ ఆనంద్, ఎంఈవో డీ రఘుపతి, బొల్లి భగవాన్, చిట్యాల రత్నాకర్, ఆడెపు చక్రపాణిలాంటి దాతృత్వం కలిగిన వారెందరో పోపాలో సభ్యులుగా ఉన్నారు. ఇందులోని 500 మంది పురుషులు, 100 మంది మహిళలు సొంత ఖర్చులతో నేతన్నలకు నిత్యావసరాలు, వైద్య శిబిరాలు, వారి పిల్లలకు ఉచితంగా ఆంగ్లబోధన, పాలిటెక్నిక్ ఎంట్రెన్స్ కోచింగ్‌లో ఉచిత శిక్షణ ఇస్తూ ఉన్నత విద్యలో రాణించేలా విశేష కృషి చేస్తున్నది.

ఉన్నత విద్యవైపు అడుగులు వేయిస్తూ...

నేతన్నల బిడ్డలు అనేక మంది ఇంటర్, డిగ్రీ వరకు చదివి మానేస్తున్నారు. ఇందుకు ప్రధాన కారణం పేదరికమే. అలాంటి వారికి పోపా అండగా నిలుస్తున్నది. 120 మందికి ఉచిత ఆంగ్ల బోధనలో నైపుణ్య శిక్షణ ఇచ్చింది. ఇటీవలి పాలిటెక్నిక్ ఎంట్రెన్స్‌లోనూ సీట్లు సాధించేలా 80 మంది విద్యార్థులకు సుశిక్షుతులైన అధ్యాపకులతో ఉచిత శిక్షణ ఇచ్చింది. సర్కారు కొలువులు సాధించిన ఉద్యోగులు, ప్రైవేటు రంగంలో నైపుణ్యం ప్రదర్శించిన 18 మంది కళాకారులకు పోపా ప్రతిభా పురస్కారలతో సత్కరించింది. కార్మికుల ఆరోగ్య పరిస్థితిపై దృష్టి సారించింది. ఈ దిశగా మండెపల్లి కేసీఆర్ కాలనీలో 400 మందికి, సిరిసిల్లలో 300 మందికి హోమియో వైద్యం అందించింది. వస్త్ర సంక్షోభంతో ఉపాధి కోల్పోయిన బాధిత కుటుంబాలకు 105 మందికి నిత్యావసరాలు పంపిణీ చేసి అండగా నిలిచింది.

ప్రతిభా పురస్కారాలతో నేత కార్మికుల పిల్లలు

విద్యలో రాణించేలా ప్రోత్సహిస్తున్నం..

అత్యంత దయనీయస్థితిలో ఉన్న నేతన్నల కుటుంబాలకు అండగా నిలుస్తూనే వారి పిల్లలను విద్యలో రాణించేలా పోపా ప్రతినిధి సభ్యులంతా తమకు తోచిన విధంగా సేవలందిస్తున్నారు. పిల్లలు చదువుకుని ఉద్యోగాలు సాధిస్తే ఆ కుటుంబానికి ఆసరా ఉంటుంది. 8వ తరగతి నుంచి 12వ తరగతి వరకు చదివే ఏఎంఎంఎస్ స్కాలర్ షిప్‌కు ఎంపికయ్యేలా శిక్షణ ఇస్తాం. సభ్యులకు కూడా వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నం. సభ్యులందరి సహకారంతో ముందుకెళ్తున్నాం.

-కనుకుంట్ల పున్నం చందర్, సైకాలజిస్టు పోపా జిల్లా కార్యదర్శి సిరిసిల్ల

కార్గో సేవలను విస్తృతం చేస్తాం

● కరీంనగర్ రీజియన్ ఏటీఎం వీ రామారావు

కార్గో సేవలను ప్రారంభిస్తున్న కరీంనగర్ రీజియన్ ఏటీఎం వీ రామారావు, డీఎం ప్రకాశ్‌రావు

కలెక్టరేట్, ఆగస్టు 11 : జిల్లాలోని ప్రజలకు అందుబాటులో కార్గో లాజిస్టిక్స్ సేవలను మరింత విస్తృత పరుస్తామని కరీంనగర్ రీజియన్ ఏటీఎం వీ రామారావు అన్నారు. ఈ మేరకు ఆదివారం ఏటీఎం వీ రామారావు, సిరిసిల్ల డిపో మేనేజర్ ఏ ప్రకాశ్‌రావు, ట్రాఫిక్ ఎస్ఐ అల్లం రమేశ్‌తో కలిసి నూతన బస్టాండులో కార్గో లాజిస్టిక్స్ సేవల కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, సిరిసిల్ల పాత బస్టాండ్‌లో రద్దీ అధికమైందని వినియోగదారుల సౌకర్యార్థం, కార్గో సేవలను మరింత విస్తరించేందుకు సిరిసిల్ల కొత్త బస్టాండులో కార్గో సేవలు ప్రారంభించామన్నారు. జిల్లా ప్రజలు కార్గో లాజిస్టిక్స్ సేవలను వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. అలాగే రాఖీ పౌర్ణమి పురస్కరించుకొని రాఖీలు, స్వీట్లను పంపడానికి కార్గో సేవలను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో టీఐ-2 మాళి, కార్గో సేల్స్ టీం లీడర్ రాజు, శేఖర్‌రావు, ఏజెంట్ రామకృష్ణ, ప్రవీణ్, గాలయ్య, రామ్‌రెడ్డి, చారి, ఆర్టీసీ ఉద్యోగులు, కార్గో వినియోగదారులు రాజేశం, పండరి, ముకుందం, ఆంజనేయులు, రమేశ్, వినియోగదారులు పాల్గొన్నారు.

మల్కా చేనేత వస్త్ర దుకాణం ప్రారంభం

మల్కా దుకాణాన్ని ప్రారంభిస్తున్న ట్రస్టు డైరెక్టర్ ఉజురమ్మ, కోఆర్డినేటర్ సత్యనారాయణ,స్థానిక నేతలు

సిరిసిల్ల రూరల్, ఆగస్టు 11: తంగళ్లపల్లి మండల కేంద్రంలో మల్కా ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మల్కా చేనేత యూనిట్‌ను ఆదివారం ప్రారంభించారు. ప్రపంచ వ్యాప్తంగా మల్కా వస్త్రాల ప్రత్యేకత ఉందని, అధిక డిమాండ్ ఉందని డైరెక్టర్ ఉజురమ్మ తెలిపారు. చేనేత వస్త్రాలకు మల్కా ద్వారా పూర్వ వైభవం వస్తుందన్నారు. మల్కా ఫ్యాబ్రిక్‌ను హై-ఎండ్ ఫ్యాషన్ లేబుల్‌తోపాటు అనేక స్వతంత్ర బొటిక్ డిజైనర్లలో ఉపయోగిస్తామన్నారు. జపాన్, అమెరికా, యూరప్ నుంచి మల్కాకు ఆర్డర్‌లు వచ్చాయని తెలిపారు. మల్కా ధరించడంతో వేసవిలో చల్లగా, చల్లగా ఉండే రోజుల్లో వెచ్చగా, ప్రతి వాష్ తరువాత కూడా నిరంతం మృదువుగా ఉంటాయన్నారు. తంగళ్లపల్లిలో యూనిట్ ఏర్పాటు చేశామని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ సత్యనారాయణ, మేనేజన్ బూర నారాయణ, ఉరగొండ ఓదెలు, పద్మశాలీ సంఘ అధ్యక్షుడు రాపెల్లి ఆనందం, మాజీ సర్పంచ్ అంకారపు రవీందర్, సభ్యులున్నారు.

స్టేట్ అకాడమీకి ఎంపికైన ఆరాధ్య

ఆరాధ్యను శాలువాతో సన్మానిస్తున్న జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు చెన్నమనేని శ్రీకుమార్

కోనరావుపేట, ఆగస్టు 11: మండలంలోని భూక్యారెడ్డి తండాకు చెందిన లకావత్ సుదర్శన్, రజిత దంపతుల కూతురు ఆరాధ్య అండర్-14 విభాగం వాలీబాల్‌లో ప్రతిభ కనబర్చి, హైదరాబాద్‌లోని తెలంగాణ స్టేట్ అకాడమీకి ఎంపికైంది. ఈమేరకు ఆరాధ్యను జిల్లా యువజన క్రీడాధికారి అజ్మీరా రాందాస్, ఉమ్మడి జిల్లా ఆర్గనైజేషన్ సెక్రటరీ, జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు చెన్నమనేని శ్రీకుమార్, టీఎస్టీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శర్మనినాయక్, జిల్లా క్రీడా సంఘం సభ్యులు లక్ష్మణ్, మాజీ సర్పంచ్ లకావత్ ప్రమీల, తిరుపతి నాయక్ శాలువాతో సన్మానించి అభినందించారు.

బాల్య మిత్రుడికి ఆర్థిక సాయం

అనారోగ్యంతో మంచానపడ్డ మిత్రుడికి ఆర్థిక సహాయం అందజేస్తున్న చిన్ననాటి మిత్రులు

ముస్తాబాద్, ఆగస్టు 11 : గంభీరావుపేట మండల పరిధిలోని మల్లారెడ్డి పేట గ్రామానికి చెందిన విజయ్ అనారోగ్యానికి గురై మంచానపడ్డాడు. విజయ్ పక్షవాతంతో మంచానపడ్డాడని, అతని కుటుంబ ఆర్థిక పరిస్థితులు బాగాలేవని 1994 సంవత్సరంలో ముస్తాబాద్ మండల కేంద్రంలో పదో తరగతి వరకు చదివిన స్నేహితులకు తెలిసింది. దీంతో మిత్రులు తలా కొంత రూ.20 వేలను పోగుచేసి విజయ్ ఇంటికి వెళ్లి అందజేశారు. ఇక్కడ బాల్యమిత్రులు ముత్యాల దేవేందర్, గుర్రాల శ్రీనివాస్ రెడ్డి, బండారి రమేశ్, పార్వతి శ్రీధర్, దావీరెడ్డి దేవేందర్‌రెడ్డి తదితరులున్నారు.

మాజీ సర్పంచ్ విగ్రహావిష్కరణ

విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

ఇల్లంతకుంట, ఆగస్టు 11 : మండ లంలోని గాలిపెల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ అయ్యన్నగారి లింగారెడ్డి విగ్రహాన్ని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ఆదివారం ఆవిష్కరించారు. అయ్యన్నగారి లింగారెడ్డి ప్రథమ వర్ధంతి పురష్కరించుకుని వారి కుమారులు హరికృష్ణా రెడ్డి, దామోదర్ రెడ్డి కుటుంబ సభ్యులు ఆయన విగ్రహం ఏర్పాటు చేయగా నేడు ఆవిష్కరించామన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ లింగారెడ్డి ఒక నాయకునిగా గ్రామానికి ఎంతో సేవ చేశారన్నారు. ఇక్కడ పీఏసీఎస్ చైర్మన్ అన్నాడి అనంత రెడ్డి, మాజీ చైర్మన్ మాదవ రెడ్డి, మాజీ ఎంపీపీ గుడిసె ఐలయ్య, నాయకులు అంగిరి వినయ్, భాస్కర్ రెడ్డి, బాలపోశయ్య, రమేశ్, ఎల్లారెడ్డి, రాంరెడ్డితోపాటు లింగారెడ్డి కుటుంబ సభ్యులున్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
PLOT FOR SALE
★కరీంనగర్ హైవే ఫేస్ ఫేసింగ్‌కి DTCP, ఓపెన్ ప్లాట్స్, బెంగళూరు హైవేకి, అతి దగ్గరలో అతి తక్కువ ధరలకే ప్లాట్స్ అమ్మబడును. బ్యాంక్ లోన్ Available, ఫోన్: 8885731233, 9948033142.
NT- 326217

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571
91827 77194

ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలి

బోయినపల్లి, ఆగస్టు 11: ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కోరారు. ఆదివారం నీలోజిపల్లిలో బిగ్ టీవీ, హాస్పిటల్ 1 ఆధ్వర్యంలో మాజీ సర్పంచ్ కూస రవీందర్ సహకారంతో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజలు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇక్కడ జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి పెంచలయ్య, మాజీ ఎంపీపీ వేణుగోపాల్, మాజీ సర్పంచ్ కూస రవీందర్, కాంగ్రెస్ నాయకులు సంబ లక్ష్మీరాజం తదితరులున్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 11: హరిదాస్‌నగర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో కోనరావుపేట మండలం కొలనూరు అనుబంధ కాలనీ గొల్లపల్లికి చెందిన సూర బుచ్చయ్య(70) మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం, బుచ్చయ్య మోకాళ్ల నొప్పులకు మందులు తెచ్చుకునేందుకు బండలింగంపల్లికి తన టీవీఎస్ ఎక్సెల్‌పై బయలుదేరాడు. పదిర నుంచి హరిదాస్‌నగర్ వైపు వస్తున్న స్కూటీ టీవీఎస్ ఎక్సెల్‌ను ఢీకొట్టగా కింద పడ్డాడు. బుచ్చయ్య తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి నలుగురు కుమారులు, ఇద్దరు కూతుళ్లున్నారు.

రోడ్డు విస్తరణ పనులు ప్రారంభం

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 11: మండల కేంద్రంలోని వేణుగోపాల స్వామి ఆలయానికి వెళ్లేందుకు రోడ్డు విస్తరణ పనులు ఆదివారం మొదలు పెట్టారు. కార్తీక మాసంలో వేణుగోపాల స్వామి ఆలయంలో నిత్యం ప్రత్యేక పూజా కార్యక్రమాలతో పాటు రథోత్సవం ఉంటుంది. ఆ సమయంలో వాహనాలు, కాలినడకన వచ్చే భక్తుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామస్తులు రోడ్డును ఆనుకుని ఉన్న ఇల్లును అమ్మేందుకు ఒప్పించారు. ఇల్లును కూల్చి రోడ్డు విస్తరణ పనులు చేపట్టడంతో భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కళాశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించాలి

వేములవాడ, ఆగస్టు 11: ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని అందజేయాలని ఎస్ఎఫ్ఐ వేములవాడ డివిజన్ నాయకులు అన్నారు. ఆదివారం వేములవాడ పట్టణంలో సామల్ల సాయి భరత్, కడారి శివ విలేకరులు సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలన్నారు. చాలామంది విద్యార్థులు ప్రభుత్వ కళాశాలలో చదువుకుంటున్నారని దూరప్రాంతాల నుంచి విద్యార్థులు కళాశాలకు ఉదయాన్నే వస్తున్నారని మధ్యాహ్న భోజనం లేకపోవడం ద్వారా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇక్కడ ఎస్ఎఫ్ఐ డివిజన్ ఉపాధ్యక్షుడు రాచకొండ శివ, నాయకులు విజేంద్ర, సాయికుమార్, ప్రభాస్, రవితేజ తదితరులున్నారు.

మామూలు నొప్పనుకుంటే..

● హెపాటిక్‌సిస్ట్‌తో మహిళ మృతి ● హరిదాస్‌నగర్‌లో విషాదం

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 11: మామూలు కడుపునొప్పి అనుకుని ఓ మహిళ మెడికల్ షాపులో మందులు తెచ్చుకుని వేసుకున్నది. ఆ వ్యాధి కాస్త ముదరడంతో చివరికి దవాఖానకు పోయినా.. ప్రాణాలు దక్కలేదు. ఈ ఘటన ఎల్లారెడ్డిపేట మండలం హరిదాస్‌నగర్‌లో ఆదివారం చోటుచేసుకున్నది. వివరాల్లోకి వెళ్తే.. హరిదాస్‌నగర్‌కు చెందిన ఉప్పుల రజిత(28) కొంతకాలంగా కడుపు నొప్పితో బాధపడుతున్నది. పూర్తిస్థాయిలో పరీక్షలు చేయించుకోకుండానే మెడికల్ షాపులో టాబ్లెట్స్ తెచ్చుకుని వేసుకునేది. శనివారం కడుపు నొప్పి తీవ్రం కావడంతో కుటుంబ సభ్యులు సిరిసిల్లలోని ఓ ప్రైవేట్ దవాఖానకు తీసుకెళ్లగా, పరీక్షలు చేసిన అనంతరం వైద్యులు హెపాటిక్‌సిస్ట్‌గా(లివర్‌కు గడ్డ కావడం) గుర్తించారు. మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానకు తీసుకెళ్లగా, అక్కడ చికిత్సపొందుతూ ఆదివారం మృతిచెందింది. కాగా, రజితకు భర్త లక్ష్మణ్, ఏడేండ్ల కుమారుడు ఉన్నారు.

కేసీఆర్‌ను కలిసిన మాజీ ఎంపీపీ శరత్‌రావు

ముస్తాబాద్, ఆగస్టు 11 : మండల కేంద్రంలో మాజీ ఎంపీపీ జనగామ శరత్‌రావు పుట్టిన రోజు వేడుకలు ఆదివారం పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంతో పాటు ఆయన స్వగ్రామం మద్దికుంటలో పార్టీ శ్రేణులు, అభిమానులు ఆలయాల్లో పూజలు నిర్వహించారు. స్వీట్లు పంచారు. తన పుట్టిన రోజున తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఎర్రవెల్లి ఫామ్‌హౌస్‌లో కలిసి పూలమొక్కను అందించి ఆశీస్సులు తీసుకున్నట్లు ఆయన తెలిపాడు.

తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌కు పూల మొక్క అందిస్తున్న మాజీ ఎంపీపీ జనగామ శరత్‌రావు

బాధిత కుటుంబానికి పరామర్శ

ముస్తాబాద్ ఆగస్టు 11 : మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జిల్లా ఉపాధ్యక్షుడు బుర్ర రాములు గౌడ్ శనివారం మృతి చెందగా ఆయన కుటుంబ సభ్యులను ఆదివారం మాజీ ఎంపీపీ జనగామ శరత్‌రావు బీఆర్ఎస్ నాయకులతో కలిసి పరామర్శించారు. ఇక్కడ బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

నిండుకుండలా నిమ్మపల్లి మూలవాగు ప్రాజెక్టు

కోనరావుపేట మండలంలోని సామర్థ్యం 19 అడుగుల సామర్థం ఉన్న నిమ్మపల్లి మూలవాగు ప్రాజెక్టు నిండుకుండను తలపిస్తున్నది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షానికి ప్రాజెక్టులోకి వరదనీరు పోటెత్తడంతో పూర్తిగా నిండిపోయి మత్తడి దుంకుతున్నది. దీంతో రైతన్నలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

-కోనరావుపేట, ఆగస్టు 11

ఎమ్మార్పీఎస్ సంబురాలు

సిరిసిల్ల రూరల్, ఆగస్టు 11: ఎస్సీ వర్గీకరణకు సుప్రీంకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ఎమార్పీఎస్ నాయకులు సంబురాలు జరుపుకున్నారు. తంగళ్లపల్లి మండలం అంకిరెడ్డిపల్లెలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి బొల్లారం చంద్రమౌళి ఆధ్వర్యంలో మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈనెల 13న మందకృష్ణ మాదిగకు ఘన స్వాగతం పలకాలని కోరారు. కార్యక్రమంలో ఖానాపురం లక్ష్మణ్, ఎమ్మార్పీఎస్ జిల్లా కోఆర్డినేటర్ పసుల కమలాకర్, కనకరాజు, సుంకపాక దేవయ్య, బిగుల్ల సురేశ్, మంద రమేశ్, అంజయ్య, శేఖర్, బాలకిషన్, తదితరులున్నారు.

విజయోత్సవ సభను విజయవంతం చేయండి

వేములవాడ రూరల్, ఆగస్టు 11: ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఈనెల 13న సికింద్రాబాద్‌కు వస్తున్నందున విజయోత్సవ సభను ఏర్పాటు చేసినట్లు ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుండా థామస్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా థామస్ మాట్లాడుతూ, ఎంఆర్‌పీఎస్ వర్గీకరణ చేపట్టాలని సుప్రీంకోర్టు తీర్పు వెలువడిన అనంతరం మొదటిసారిగా హైదరాబాద్ వస్తున్న మందకృష్ణమాదిగకు స్వాగతం పలకడానికి పెద్దఎత్తున మాదిగ ఉపకులాల ప్రజలు తరలిరావాలన్నారు. ఇక్కడ జిల్లా కన్వీనర్ ఎలగందుల భిక్షపతి, ఆవునూరి ప్రభాకర్, చంద్రమౌళి, బేస్‌కుమార్, మేకల బాబు, లక్ష్మణ్, నారయణ తదితరులున్నారు.

ఇల్లంతకుంట, ఆగస్టు 11 : ఎస్సీ వర్గీకరణ సాధించిన మంద కృష్ణ మాదిగ చిత్రపటానికి ఎమ్మార్పీఎస్ నాయకులు పాలాభిషేకం చేశారు. మండలంలోని అనంతారం గ్రామానికి చెందిన ఎమ్మార్పీఎస్ నాయకులు అంబేద్కర్ విగ్రహం చౌరస్తాలో ఆదివారం మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఇక్కడ ఎమ్మార్పీఎస్ నాయకులు లింగం, దాసు, బాబు, స్వామితోపాటు తదితరులున్నారు.

ఉచిత వైద్య శిబిరం

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 11: జిల్లా కేంద్రంలోని అంబికానగర్‌లో ఆదివారం వేముల సురేశ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వేములవాడకు చెందిన శ్రీవర్ష కంటి దవాఖాన వైద్య బృందం పలువురికి కంటి పరీక్షలు చేసి అవసరమైన మందులు, అద్దాలను పంపిణీ చేశారు. ఇక్కడ నిర్వాహకులు ఆనంద్, అనిల్, తదితరులున్నారు.

ఎమ్మెల్యేకు ఆశ కార్యకర్తల వినతి

బోయినపల్లి, ఆగస్టు 11: మండలంలోని ఆశ కార్యకర్తల ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు వినతి పత్రం సమర్పించారు. ఆదివారం నీలోజిపల్లిలో ఓ ప్రైవేట్ కార్యక్రమానికి వచ్చిన ఆయనకు వారి సమస్యలపై, వేతనం పెంచాలని తదితర సమస్యలపై వినతి పత్రం సమర్పించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

కోనరావుపేట, ఆగస్టు 11: మండలంలోని మంగళ్లపల్లె గ్రామానికి చెందిన మొగిలి పాలెం మల్లవ్వకు రూ.27వేల విలువ గల సీఎంఆర్ఎఫ్ చెక్కు మంజూరు కాగా స్థానిక నేతలు అందజేశారు. ఇక్కడ బాలరాజు, సురేశ్, మల్లేశం, శేఖర్, మహేశ్, రాజు, పరశురాములు, రాజిరెడ్డి, నర్సయ్య ఉన్నారు.

బోయినపల్లి లైబ్రేరియన్‌కు ఉత్తమ అవార్డు

బోయినపల్లి, ఆగస్టు 11: బోయినపల్లి మండల కేంద్రంలోని లైబ్రేరియన్ కమటం మల్లయ్య ఉత్తమ లైబ్రేరియన్ అవార్డుకు ఎంపికైనట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బుగ్గారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. బోయినపల్లి లైబ్రరీ గ్రంథపాలకుడు కమటం మల్లయ్య జిల్లా గ్రంథాలయ ఇన్‌చార్జిగా, గ్రంథ పాలకులుగా పనిచేస్తున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం జాతీయ గ్రంథాలయ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లో ఉత్తమ లైబ్రేరియన్ అవార్డు ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు.

దుర్గమ్మ ఆలయ నిర్మాణానికి విరాళం

కోనరావుపేట, ఆగస్టు 11: మండలంలోని పల్లిమక్త గ్రామంలో దుర్గమ్మ ఆలయ నిర్మాణానికి గ